మూడో రోజూ భారీగా దరఖాస్తుల స్వీకరణ


ఆరెపల్లిలో కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య


కాశిబుగ్గ: 19 డివిజన్ వీకర్ సెక్షన్‌కాలనీలో..


వరంగల్ 27వ డివిజన్‌లో..

కరీమాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన సభలకు ప్రజలు భారీగా తరలి వస్తున్నారు. వరంగల్ జిల్లాలోని 13 మండలాలతోపాటు వర్ధన్నపేట, నర్సంపేట మున్సిపాలిటీలు, గ్రేటర్ వరంగల్ పరిధిలోని 32 డివిజన్లలో శనివారం 88,291 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. గ్రేటర్ వరంగల్ 20వ డివిజన్ కాశిబుగ్గ బీఎన్‌రావు కమ్యూనిటీ హాల్ వద్ద నిర్వహిస్తున్న సెంటర్, 21వ డివిజన్ లోతుకుంట కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్న సెంటర్‌ను కలెక్టర్ ప్రావీణ్య సందర్శించారు. కార్పొరేటర్ మహ్మద్ ఫుర్కాన్, వరంగల్ తూర్పు నోడల్ అధికారి కృష్ణారెడ్డి, ఆర్డీఓ వాసుచంద్ర, ఇండస్ట్రీస్ జీఎం నరసింహామూర్తి, బయాలజిస్ట్ మాధవరెడ్డి, వార్డు నోడల్ అధికారి సుష్మ, టీపీఓ బషీర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ధరమ్‌సింగ్ పాల్గొన్నారు.

19వ డివిజన్‌లో..

కాశిబుగ్గ: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా 19వ డివిజన్ వీకర్ సెక్షన్‌కాలనీలో దరఖాస్తులను శనివారం స్వీకరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, అభయహస్తం దరఖాస్తులకు డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు దాసరి రాజేష్, నాయకులు కూచన రవీందర్, వెంకన్న, శేషు, జంగం ప్రభాకర్, ప్రశాంత్, హరి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


కాజీపేట బోడగుట్టలో..

27వ డివిజన్‌లో..

వరంగల్ చౌరస్తా: ఆరు గ్యారంటీల దరఖాస్తులను సకాలంలో సమర్పించాలని టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ కోరారు. వరంగల్ 27వ డివిజన్ బాపూజీ కమ్యూనిటీ హాల్‌లో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు అందాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఆయన అన్నారు.


దరఖాస్తు అందజేసిన డయాలసిస్ బాధితుడు

బోడగుట్టలో..

కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్ బోడగుట్టలోని కమ్యూనిటీహాల్‌లో శనివారం ప్రజా పాలన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రజలు తరలివచ్చి ప్రజాపాలన దరఖాస్తులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సందెల విజయ్‌కుమార్, రాజిరెడ్డి, రావుల విద్యాసాగర్, కాసర్ల నాగేష్, అశోక్, సత్యవరం మధుకర్, సురేందర్, వంశీ, చింటు, ఆర్పీలు, ఆశ కార్యకర్తలు, జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

డయాలసిస్ బాధితుడి దరఖాస్తు

ఖిలా వరంగల్: వరంగల్ 39వ డివిజన్ లక్ష్మీనగర్ ఏకశిలనగర్‌కు చెందిన ఓ వృద్ధుడు రెండు కిడ్నీలు పాడై డయాలసిస్ చేయించుకుంటున్నాడు. బాధితుడు ఆస్పత్రి నుంచి నేరుగా జన్మభూమి జంక్షన్‌లోని మున్నూరు కాపు పరపతి సంఘంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సెంటర్‌కు వచ్చి అభయహస్తానికి దరఖాస్తు చేసుకున్నాడు.

డబుల్ బెడ్రూం ఇళ్లకు నీళ్లొచ్చాయి

ఏడాదిన్నర తర్వాత నీటి సరఫరా

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం సిద్దాపురం గ్రామంలో డబుల్ బెడ్రూ ఇళ్లకు శనివారం తాగునీరు సరఫరా చేశారు. ప్రారంభించినప్పటి నుంచి ఏడాదిన్నర కాలంగా డబుల్ బెడ్రూం కాలనీలో తాగునీరు లేక లబ్ధిదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేసినప్పటికీ నీటి వసతి కల్పించలేదు. గ్రామపంచాయతీ ద్వారానే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేశారు. పంచాయతీలో నిధుల కొరత ఉన్నప్పటికి స్థానిక సర్పంచ్ ధనలక్ష్మి నీటి ఖర్చును భరిస్తూ వచ్చారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, నీటి సరఫరాకు ప్రత్యేక నిధులు కేటాయించారు. ఈక్రమంలో పైప్‌లైన్ ఏర్పాటు చేసినప్పటికీ అధికారులు కనెక్షన్ ఇవ్వడానికి నిరాకరిస్తూ వచ్చారు. ఈనెల 12వ తేదీన సర్పంచ్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో లబ్ధిదారులు మిషన్ భగీరథ ప్రధాన కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. దాంతో అధికారులు దిగొచ్చి నీటి సరఫరా చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనలక్ష్మి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు కిరణ్, ఏఈ హంజా, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.


నల్లానీరు పట్టుకుంటున్న లబ్ధిదారులు

నూతన సంవత్సర వేడుకల్లో అతి తగదు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వినోద్‌కుమార్

కాజీపేట: నూతన సంవత్సర వేడుకల్లో అతి తగదని కాజీపేట ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు సూచించారు. ఎలాంటి అపశ్రుతికి తావివ్వకుండా పట్టణవ్యాప్తంగా ట్రాఫిక్ పోలీసుల సహకారంతో విస్తృత తనిఖీలు నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కాజీపేట పోలీసుస్టేషన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం ప్రమాదకరమని యువకులు గుర్తించాలన్నారు. మద్యం సేవించి వేగంగా వాహనాలు నడపడం, ముగ్గురు ఒకే బైక్‌పై ప్రయాణించడం, సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, జిగ్‌జాగ్, సర్కాస్ ఫీట్లు, సైలెన్సర్ లేని బైక్‌లు నడపడం, కేకలు వేస్తూ తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మందుబాబులను కట్టడి చేయడానికి పలు ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తామని తెలిపారు.

చాణిక్య విద్యానికేతన్‌లో ముందస్తు వేడుకలు

ఖిలా వరంగల్: వరంగల్ విద్యానగర్ కాలనీలోని చాణిక్య విద్యానికేతన్ హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ అచ్చ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ముందుస్తుగా నూతన సంవత్సర వేడుకలను శనివారం నిర్వహించారు. 2023కు వీడ్కోలు పలుకుతూ 2024వ సంవత్సరానికి స్వాగతం చెబుతూ విద్యార్థులు కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం పరస్పరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రవీణ్, శ్వేత, రహీమతుల్లా, సంధ్య, సుమన్, శిరీష్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో చెఫ్ డే వేడుకలు

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ సోమిడి శివారులోని తాళ్ల పద్మావతి ఒలంపియాడ్ పాఠశాల ఆవరణలో చిరుధాన్యాలతో చెఫ్ డే వేడుకలను విద్యార్థులు శనివారం నిర్వహించారు. తాళ్ల విద్యా సంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ పరిణామ క్రమంలో చిరుధాన్యాలు ప్రముఖ పాత్ర పోషించాయని వివరించారు. చిరుధాన్యాలతో ఎగ్జిబిట్లు ప్రదర్శించిన విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ తాళ్ల వంశీ, చైతన్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వేలు, కోఆర్డినేటర్లు అఫ్జలున్నీసా, మహేందర్ రెడ్డి, భాగ్యలక్ష్మి, రాకేష్, యామిని తదితరులు పాల్గొన్నారు.


ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న డైరెక్టర్లు

విద్యతోనే సమాజంలో గౌరవం


సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

విద్యారణ్యపురి: విద్యతోనే సమాజంలో గౌరవం, మర్యాద లభిస్తుందని సైకాలజీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. యూనివర్సిటీ సమీపంలోని భీమారం కేజీబీవీ విద్యాలయంలో ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణలోని సైకాలజిస్టుల సంఘం సహకారంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని 10వ తరగతి విద్యార్థులకు మూడు నెలలపాటు నిర్వహించనున్న ప్రేరణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో విజయం సాధించాలంటే అందుకు అనుసరించాల్సిన సూచనలు, సలహాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ సైకాలజిస్టుల సంఘం జాయింట్ సెక్రటరీ మురళీధర్ రావు, బాధ్యులు కుమారస్వామి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వప్న, ఉపాధ్యాయులు రజిత, మమత, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ప్రతిభాపాటవ పోటీలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని బాటనీ విభాగంలో శాంతి సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు డాక్టర్ అనీస్‌సిద్ధిక్ అధ్యక్షతన శనివారం జిల్లాస్థాయి వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా సిద్దిక్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకే ఇలాంటి పోటీలు దోహదపడతాయని అన్నారు. విజేతలకు త్వరలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కేయూ బాటనీ విభాగం ప్రొఫెసర్ ఎండీ.ముస్తఫా, శాంతి సంఘం బాధ్యులు రాజమహ్మద్, ఇక్బాల్, నన్నెసాహెబ్, నసీర్, దర్శన్‌సింగ్, సర్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉద్యోగ విరమణే.. ఉద్యమ విరమణ కాదు



విద్యారణ్యపురి: తాను ఉపాధ్యాయురాలిగా ఉద్యోగ విరమణ చేస్తున్నానే తప్ప ఉద్యమ విరమణ చేయడం లేదని ప్రభుత్వ ఉపాధ్యాయురాలు సముద్రాల అనిత అన్నారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో 28 ఏళ్లుగా ఉపాధ్యాయురాలుగా పనిచేసిన ప్రముఖ సామాజిక కార్యకర్త, చైతన్య మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు అనిత.. వలంటీర్ రిటైర్‌మెంట్ తీసుకున్నారు. ఈ సందర్భంగా హనుమకొండలోని ప్రభుత్వ అభ్యసన ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన ఉద్యోగ విరమణ అభినందన సభలో ఆమె మాట్లాడారు. పాఠశాల హెచ్‌ఎం ఆముదాలదాత మహర్షి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీటీఎఫ్ బాధ్యులు సమ్మిరెడ్డి, రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు బూర సరళ, సుధాకర్, రమేష్, భాగ్యలక్ష్మి, రమాదేవి, సరస్వతి, దయాసాగర్, గోపికృష్ణ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం


భాస్కర్‌రావు (ఫైల్)

కాజీపేట: హనుమకొండ పట్టణంలోని జులైవాడకు చెందిన సజ్జ భాస్కర్‌రావు (95) శనివారం మృతి చెందారు. కాగా, కుటుంబ సభ్యుల అంగీకారంతో మృతుడి నేత్రాలను దానం చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న భాస్కర్ రావు మృతి చెందగా ఆయన కుమారులు రిటైర్డ్ డీఎస్పీ ఆంజనేయులు, కృష్ణ, కూతురు భారతి సమ్మతితో తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ సహకారంతో ఎల్వీ ప్రసాద్ కంటి సేకరణ నిపుణులు మృతుడి నేత్రాలను సేకరించారు.

క్రీడాకారులకు ఆర్థిక సాయం



హసన్‌పర్తి: జాతీయ స్థాయి తంగ్ - తా మార్షల్ ఆర్ట్స్‌లో ఎంపికైన వంగపహాడ్ పాఠశాలకు చెందిన పి.హర్షిత, ఎస్.అక్షితకు రూ.5వేల ఆర్థిక సాయాన్ని స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ గోపి అందజేశారు. ఇటీవల నెల్లికుదురులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొని జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. జనవరి 11నుంచి 17వ తేదీ వరకు న్యూఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో వారిరువురు పాల్గొననున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత తెలిపారు. క్రీడాకారుల ప్రయాణంతో పాటు ఇతర ఖర్చులకు దాతలు ముందుకు వచ్చి సాయం చేయాలని కోరారు.

ఎమ్మెల్సీ కవితకు స్వాగతం

కాజీపేట రూరల్: భారత జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, నాయకులు కాజీపేట బాపూజీనగర్‌లో శనివారం ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్, కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్, నాయకులు శ్రీకాంతాచారి, మర్రి యాదవరెడ్డి, నాగుర్ల వెంకటేశ్వర్లు, జనార్దన్ గౌడ్, నార్లగిరి రమేష్, గబ్బెట శ్రీనివాస్, శిరుమల్ల దశరథం, మర్యాల కృష్ణ, ఎండీ.అఫ్జల్‌పాషా, గాజుల విజయ్, తదితరులు పాల్గొన్నారు.

మేం విధులు నిర్వహించలేం

హసన్‌పర్తి: క్షేత్రస్థాయిలోకి వెళ్లి విధులు నిర్వహించలేమని ఏఈ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈమేరకు నీటి పారుదల శాఖ వరంగల్ సర్కిల్ ఎస్ఈ సుధాకర్‌రెడ్డికి శనివారం వినతి పత్రం అందించారు. ఎస్సారెస్పీ భూముల కబ్జాపై చర్యలు ఉపక్రమించే క్రమంలో పలివేల్పులలో కొంతమంది అక్రమార్కులు శుక్రవారం చేసిన భౌతికదాడి యత్నంతో పాటు మొబైల్ ధ్వంసం చేసిన విషయాన్ని ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లారు. ఐదారుగురు వ్యక్తులు తమ చొక్కా పట్టారని ఎస్ఈకు ఏఈ కిశోర్ వివరించారు. అన్నాసాగరం నుంచి ఆటోనగర్ వరకు వందలాది ఎకరాల భూముల్లో గుడిసెలు వెలిశాయని ఎస్ఈ సుధాకర్‌రెడ్డికి ఏఈలు వివరించారు. భూములను కాపాడానికి వెళితే భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని ఎస్ఈ సుధాకర్‌రెడ్డి సీరియస్‌గా పరిగణించారు. పోలీస్ రక్షణ కలిస్తే భూములను కాపాడుతామని నగర పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝాకు లేఖ రాశారు.

ధనుర్మాసోత్సవ పూజలు

కాజీపేట: ధనుర్మాసోత్సవాన్ని పురస్కరించుకొని చైతన్యపురి వేంకటేశ్వరస్వామి దేవాలయంలోని గోదాదేవి, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామికి మహిళలు శనివారం మంగళహారతులతో పూజలు చేశారు. ఆలయ ప్రధాన పూజారి రఘురామాచార్యులు ఆధ్వర్యంలో ఆలువేలు మంగ సమేతుడైన స్వామివారికి మంగళహారతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పంజాల అశోక్‌కుమార్ గౌడ్, మేజర్ వడ్డెపల్లి నరేందర్‌లతో పాటు పాలక మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సహజం..


ఉద్యోగులను సన్మానిస్తున్న అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్, తదితరులు

వరంగల్ అర్బన్: ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజం అని బల్దియా అదనపు కమిషనర్ అనీసుర్ రషీద్ అన్నారు. బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్‌లో బల్దియా జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉద్యోగుల పదవీ విరమణ కార్యక్రమానికి అదనపు కమిషనర్ ముఖ్యఅతిథిగా హాజరై సిబ్బందిని సన్మానించారు. బల్దియాలో దీర్ఘకాలంగా ప్రజారోగ్య, ఇంజనీరింగ్ విభాగాల్లో సేవలు అందించిన మంద రాజేందర్, హెల్పర్‌గా సేవలందించిన సరుగు శ్రీనివాస్‌ను అదనపు కమిషనర్, అధికారులు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఈఈ సంజయ్‌కుమార్, జేఏసీ అధ్యక్షుడు గౌరీశంకర్, సూపరింటెండెంట్ ఆనంద్, కార్యవర్గ సభ్యులు గోల్కొండ శ్రీనివాస్, ధర్మరాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు బ్లాంకెట్ల పంపిణీ



ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారుల రోగుల సహాయకులకు శివానంద గురు కల్చరల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపిచంద్ శనివారం బ్లాంకెట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంజీఎం ఆస్పత్రిలో పిల్లల వార్డులో చలితో బాధపడుతున్న దాదాపు చిన్నారులకు ట్రస్టు తరఫున బ్లాంకెట్లు అందించినట్లు తెలిపారు. ట్రస్ట్ సహాయ సహకారాలకు ట్రస్ట్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

భక్తులకు వసతులు కల్పించాలి

కరీమాబాద్: గ్రేటర్ పరిధిలో నిర్వహించనున్న అమ్మవారిపేట సమ్మక్క - సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని వసతులు కల్పించాలని జాతర చైర్మన్ కోడూరి భిక్షపతి కోరారు. ఈమేరకు ఉర్సు నాగేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఈఓ కమల సమక్షంలో కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ జాతర నిర్వహణకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, స్థానిక ఎమ్మెల్యే నాగరాజుతోపాటు కార్పొరేటర్లు కూడా సహకారం అందించాలని కోరారు. సమావేశంలో జాతర ధర్మకర్త, ఆర్గనైజర్ దాసి రాందేవ్, బైరి నాగరాజు, హరినాథ్, స్వామి, కుమారస్వామి, రాంమూర్తి, వీరేశం, సుధాకర్ పాల్గొన్నారు.

ఎంబీసీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న యాదగిరి

హన్మకొండ: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలు, మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాస్ (ఎంబీసీ)లకు రెండు ఎంపీ స్థానాలు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మధ్యప్రదేశ్ ఓబీసీ సెల్ ఇన్‌చార్జ్ ఉల్లెంగల యాదగిరి సూచించారు. హనుమకొండ బాలసముద్రంలోని తన స్వగృహంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 17ఎంపీ స్థానాల్లో మూడు ఎస్సీ, 2ఎస్టీ స్థానాలు పోగా, 12 జనరల్ స్థానాలున్నాయన్నారు. అందులో 7స్థానాలు బీసీలకు కేటాయించి మరో రెండు స్థానాలు అత్యంత వెనుకబడిన తరగతుల వారికి ఇవ్వాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ రఫియొద్దీన్, నాయకులు సుధాకర్, పల్లపు యాదగిరి, మామిండ్ల నారాయణ, దురిశెట్టి సంతోష్ కుమార్, పున్నం రమేష్, మునుకుంట్ల భిక్షపతి, కందెరాజుల వెంకటసోమన్న పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడపాలి

కేయూ క్యాంపస్: పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థుల కోసం సమయపాలనను అనుసరిస్తూ ప్రత్యేక బస్సులు నడపాలని ఏబీవీపీ నాయకులు కోరారు. ఈమేరకు ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ హనుమకొండ జిల్లా కన్వీనర్ ఆరెపల్లి సుజిత్, బాధ్యులు అరుణ్, శ్రీనివాస్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల నిరసన


నిరసన తెలుపుతున్న పారిశుద్ధ్య కార్మికులు

హసన్‌పర్తి: నగరంలోని 55, 56వ డివిజన్‌ల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు ఆయా వార్డుల కార్యాలయాల ఎదుట ఎమ్మార్పీఎస్, మున్సిపల్ యూనియన్ల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య మాట్లాడుతూ గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు చీపుర్లు, చలికోట్లు, గ్లౌజులు, చెప్పులు, నూనె, సబ్బులు, గడ్డపారాలు అందించాలని డిమాండ్ చేశారు. మూడు నెలలుగా పారిశుద్ధ్యానికి సంబంధించిన పరికరాలు లేక కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. వెంటనే అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

అనాథ పిల్లలకు దుప్పట్ల అందజేత


దుప్పట్లు అందజేస్తున్న డాక్టర్ అనితారెడ్డి

హన్మకొండ: లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ అర్బన్ రెసిడెన్షియల్ హాస్టల్ పిల్లలకు నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్ డాక్టర్ అనితారెడ్డి శనివారం దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో పిల్లలు ఇబ్బందులు పడకూడదని తనవంతు దుప్పట్లు అందజేసినట్లు చెప్పారు. పిల్లలు బాగా చదువుకుని, క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం, వినియోగదారుల చట్టాలపై పిల్లలు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఏ వస్తువు కొనుగోలు చేసినా తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ ఇన్‌చార్జ్ దీప, సిబ్బంది శ్రీనివాస్, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

విద్యాసాగర్‌కు మహానంది పురస్కారం


పురస్కారం అందుకుంటున్న విద్యాసాగర్

హన్మకొండ కల్చరల్: తెలుగు సాంస్కృతిక మహానంది జాతీయ పురస్కారాన్ని వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిద్దోజు విద్యాసాగర్ అందుకున్నారు. సాహితీ జాతీయ పురస్కారాల మహోత్సవంలో భాగంగా తెలుగు సంస్కృతి సాహితీ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో శనివారం జరిగిన కార్యక్రమంలో సామాజికసేవా రంగంలో చేసిన కృషికి విద్యాసాగర్‌ను సన్మానించి ట్రస్ట్ సభ్యులు పురస్కారం ప్రదానం చేశారు.


హనుకాంత్‌ను సన్మానిస్తున్న మహిళలు

నంది అవార్డు గ్రహీతకు సన్మానం

కాజీపేట రూరల్: ఈనెల 28న ఇందిర ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో బంగారు నంది అవార్డు అందుకున్న షెడ్యూల్డ్ కులాల హక్కుల అభివృద్ధి సమితి కార్మిక విభాగం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు యమడాల హనుకాంత్‌ను సన్మానించారు. కాజీపేట రైల్వే చిల్డ్రన్స్ పార్కులో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్మిక సమితి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కాదాసి సులోచన, గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడు చందు, తదితరులు పాల్గొన్నారు.

రాములోరి అక్షింతలతో శోభాయాత్ర


శివనగర్‌లో మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న భక్తులు


టీఎస్‌జీఓ కాలనీ ఫేజ్ -2లో..

ఖిలా వరంగల్: అయోధ్యలో వచ్చేనెల 22న శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అయోధ్య పూజిత అక్షింతలు వరంగల్ రైల్వేగేట్ ప్రాంతానికి శనివారం చేరాయి. అక్షింతలను వరంగల్ శివనగర్‌లో స్థానిక కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, సీతారామచంద్ర స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో భక్తులు బాజాభజంత్రీలు, భజనల మధ్య మంగళ హారతులతో స్వాగతం పలికారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్షింతలను శివనగర్ పురవీధుల్లో ఊరేగించారు. త్వరలోనే ప్రతిఇంటికి అంక్షితలను పంపిణీ చేస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. వరంగల్ - ఖమ్మం రోడ్డులోని విశ్వనాథ కాలనీకి అయోధ్య రామమందిర అక్షింతలు చేరాయి. కాలనీ అధ్యక్షుడు కర్నె రవీందర్ ఆధ్వర్యంలో భక్తులు పూజలు చేసి పురవీధుల్లో ఊరేగించారు. విశ్వనాథ కాలనీ, గిరిప్రసాద్ నగర్, బుడిగ జంగాలకాలనీ మీదుగా ఆంజనేయస్వామి గుడికి శోభాయాత్రగా అక్షింతలను చేర్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, మంచాల కృష్ణమూర్తి, కర్నె రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌జీఓకాలనీ ఫేజ్ -2లో..

హన్మకొండ అర్బన్: భీమారంలోని ప్రసన్నాంజనేయ స్వామి గుడి నుంచి ఎలైట్ స్కూల్ మీదుగా శ్రీరాముడి అక్షింతల శోభాయాత్రను శనివారం నిర్వహించారు. టీఎస్‌జీఓ కాలనీఫేస్ -2లోని భక్తులు శోభాయాత్రలో పాల్గొనగా, అయోధ్య శ్రీరామ తీర్థ ట్రస్ట్ తరఫున ఉమ, మధుసూదన్ రెడ్డి అక్షింతలను తీసుకువస్తుండగా కాలనీ మహిళలు ఎదురేగి మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. టీఎస్‌జీఓ కాలనీలోని పోచమ్మ దేవాలయం వరకు తీసుకొని వెళ్లి దేవాలయంలో అక్షితంతలను భద్రపరిచారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పూజలు చేసిన అనంతరం జనవరి 1వ తేదీ నుంచి ఇంటింటికి అక్షింతలను వితరణ చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు, దేవాలయం కమిటీ, అక్షింతల వితరణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఫార్మసిస్టుల సంక్షేమానికి కృషి

గీసుకొండ: ఫార్మసిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రభుత్వ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం నిర్వహించిన వరంగల్, హనుమకొండ జిల్లాల కమిటీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిని కలిసి ఫార్మసిస్టుల సమస్యలను విన్నవిస్తామని చెప్పారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న వారిని పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కందకట్ల శరత్‌బాబు, ఫార్మసీ సూపర్‌వైజర్ వి.పద్మజాదేవి, వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.సత్యం, శ్రీదేవి, యూనిస్, సతీష్, సృజన్, సుధారాణి, సరళారాణి, రమేష్, సూరయ్య, అనిల్‌కుమార్, జ్యోత్స్న, దీప్తి, అంజి, స్వరూప, శ్వేత, రంగారావు, రాకేష్, అనిత పాల్గొన్నారు.